

పెరిగిన బియ్యం కోటా

కొత్త రేషన్‌కార్డుల మంజూరు కావడంతో జిల్లాలో పంపిణీ చేసే బియ్యం కోటా ఈనెల నుంచి పెరిగింది. వివరాలు 8లో ▸



పందిరి సాగు.. ఫలితాలు బాగు

రైతులు సంప్రదాయ పంటలకు బదులుగా ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారు.

వివరాలు 8లో ▸



శత శాతం.. లక్ష్యం

దుబ్బాక మున్సిపల్ పరిధిలో వంద శాతం ఇంటి పన్నులు వసూళ్లు జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

మల్లన్న ఐదో వారం ఆదాయం రూ.48 లక్షలు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలలో ఐదోవారం రూ. 48,10,683 వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. స్వామివారికి వివిధ రకాల మొక్కులు, దర్శనాలు, లడ్డూ ప్రసాదాలు, పట్నాలు, బోనాల టికెట్ల అమ్మకాల ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు తెలిపారు. గత ఏడాది ఐదోవారం రూ.56,03,330 సమకూరింది. ఈసారి రూ.7,92,647 తక్కువగా వచ్చినట్లు ఈఓ రామాంజనేయులు తెలిపారు.

ఫార్మా రంగంలో ఉపాధి అవకాశాలు

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఫార్మా రంగంలోని ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీ హెచ్ఆర్ విభాగాధిపతి డాక్టర్ శరత్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు కెమిస్ట్రీని ఇష్టంగా చదివి పట్టు సాధించి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఫార్మారంగంలోని వివిధ విభాగాల్లోని ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పలు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్‌కుమార్‌రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ గోపాలసుదర్శనం, కెమిస్ట్రీ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీడీసీ సభ్యులు, అధ్యాపకులు

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచేందుకు అధ్యాపక బృందం కృషి చేయాలని సీపీడీసీ సభ్యులు సూచించారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్ అధ్యక్షతన కళాశాల ప్రణాళిక అభివృద్ధి కార్యవర్గం(సీపీడీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలను కల్పించేందుకు సహకరిస్తామన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించడంతో పాటు అడ్మిషన్ల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించిన కళాశాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, సీపీడీసీ సభ్యులు డాక్టర్ ఆకుల నరేష్‌బాబు, లక్ష్మణ్, గోపాల్‌రెడ్డి, శ్రీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వసతిగృహాల్లోని విద్యార్థులకు మూడేళ్లుగా కాస్మోటిక్ చార్జీలు రావడం లేదని, వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్ కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో బీసీ హాస్టల్‌ను సందర్శించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడా సామగ్రిని సైతం సమకూర్చాలన్నారు. వసతిగృహంలో దోమల బెడద ఎక్కువ ఉందని నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

భద్రతాభావం పెంచేందుకే కార్డెన్ సెర్చ్: ఏసీపీ మధు



సీజ్ చేసిన వాహనాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రజల రక్షణకు సంబంధించి భద్రతాభావం పెంచేందుకే కార్డెన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిద్దిపేట ఏసీపీ మధు తెలిపారు. మండల పరిధిలోని ఇబ్రహీంనగర్‌లో మంగళవారం సాయంత్రం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానాస్పద ప్రాంతాల్లో నార్కోటిక్స్ డాగ్స్ తనిఖీలు నిర్వహించామన్నారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల పట్ల, అలాగే సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది తదితరులు ఉన్నారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో సీజ్ చేశారు. 16 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు.

ఉగాదికి సన్న బువ్వ!

బియ్యం పంపిణీకి సన్నద్ధం

- తొలి విడతలో 12,471 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లింగ్
- జిల్లాలో 2.91 లక్షలకుపైగా రేషన్ కార్డులు
- ప్రతి నెలా 5 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం



రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీకి అధికారులు సన్నద్ధం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన సన్న వడ్ల మిల్లింగ్‌పై పౌరసరఫరాల శాఖ ప్రత్యేక దృష్టిసారించింది. ఉగాది నుంచి పంపిణీకి కసరత్తు జరుగుతోంది. పేదలకు రేషన్ కార్డులపై ప్రస్తుతం దొడ్డు బియ్యం పంపిణీ చేస్తుండగా ఆ స్థానంలో సన్నబియ్యం ఇస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. వానాకాలంలో 419 కొనుగోలు కేంద్రాల ద్వారా మొత్తం 2,51,766 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, అందులో 9,679 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం ఉంది.

సాక్షి, సిద్దిపేట: రేషన్ కార్డుదారులకు ఉగాది పండగ రోజు సన్నబియ్యం పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల భోజనానికి ఇప్పటికే సన్నబియ్యం వినియోగిస్తున్నారు. జిల్లాలో 2,92,139 రేషన్ కార్డులు ఉండగా అన్నపూర్ణ 82, అంత్యోదయ 18,337, ఆహార భద్రత కార్డులు 2,73,720 ఉన్నాయి. వీటికి నెలకు సుమారుగా 5వేల మెట్రిక్ టన్నుల బియ్యం కాగా సంవత్సరానికి సుమారుగా 60వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం కానున్నాయి.

12,471 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లింగ్

జిల్లాలో 9,679 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం రాగా, మెదక్ జిల్లాకు చెందిన 6,403మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సిద్దిపేటకు కేటాయించారు. మొత్తంగా తొలివిడతలో 16,082 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం వచ్చింది. అందులో నుంచి 3,611టన్నుల ధాన్యాన్ని విద్యార్థుల హాస్టల్స్, మధ్యాహ్న భోజనానికి కేటాయించారు. మిగిలిన 12,471 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 52 మిల్లులకు కేటాయించారు. కస్టమ్ మిల్లింగ్ ద్వారా ఒక్కో క్వింటాల్ ధాన్యానికి 67కిలోల బియ్యం ఇచ్చేలా మిల్లర్లతో అగ్రిమెంట్ చేశారు.

ఇక రీసైక్లింగ్‌కు చెక్

కార్డులో పేరున్న ప్రతి ఒక్కరికీ నెలకు 6కిలోల చొప్పున దొడ్డు బియ్యం ప్రభుత్వం అందజేస్తోంది. అయితే తినేందుకు ఆసక్తి చూపని పేద, మధ్య తరగతి వర్గాల వారు ఆ బియ్యాన్ని కిలో రూ.10 నుంచి రూ.15 చొప్పున దళారులకు విక్రయిస్తున్నారు. ఈ బియ్యం తిరిగి రైస్ మిల్లులకు చేరుతోంది. మిల్లులు ఈ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి కస్టమ్ మిల్లింగ్ కింద ప్రభుత్వానికి అప్పగిస్తున్నట్లు తెలుస్తోంది. రేషన్ షాప్‌ల ద్వారా సన్న బియ్యం పంపిణీ ప్రారంభిస్తే వినియోగించుకుంటారని, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించవచ్చని ప్రభుత్వ భావిస్తోంది.

సన్నబియ్యం పంపిణీకి సిద్ధం చేస్తున్నాం



వానాకాలంలో సన్న ధాన్యాన్ని ప్రత్యేకంగా కొనుగోలు చేశాం. రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు ధాన్యాన్ని మిల్లర్లకు సీఎంఆర్ కోసం కేటాయించాం. వాటిని త్వరగా మిల్లింగ్ చేసే విధంగా కృషి చేస్తాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే సన్న బియ్యం పంపిణీ ప్రారంభిస్తాం.

– ప్రవీణ్, డీఎం, సివిల్ సప్లయ్ కార్పొరేషన్

తాగునీటి సరఫరాలో అంతరాయం రానివ్వం

కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి, అదనపు కలెక్టర్లు తదితరులు

సిద్దిపేటరూరల్: జిల్లాలో తాగునీటికి, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతకుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ రంగానికి, తాగునీటికి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే విద్యుత్ వినియోగంపై అధికారులతో సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతు భరోసా అర్హులకు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటుగా, రేషన్‌కార్డులకై వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులకు అందిస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, అబ్దుల్ హమీద్, ఆర్డీవోలు వివిధ శాఖల అధికారుల తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



గణితంలో లెక్కలు వేస్తూ వివరిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

కోహెడరూరల్(హుస్నాబాద్): పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ తెలిపారు. తంగళ్లపల్లిలోని కస్తూర్బా గాంధీ(కేజీబీవీ) బాలికల విద్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. పాఠశాలలో సౌకర్యాలు, పరిశుభ్రత, టాయిలెట్స్ నిర్వహణ తదితర వాటిని పరిశీలించారు. వంట సామగ్రి, తరగతి గదుల నిర్వహణ, భోజన వసతుల ఏర్పాటు, విద్యార్థుల ఆరోగ్యం, నీటి సరఫరా తదితర వాటిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పదో తరగతి గదిలోకి వెళ్లి గణిత సబ్జెక్ట్ బోధించారు. పైథాగరస్ సిద్ధాంతం గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సురేఖ, మండల విద్యాధికారి ఆర్, పద్మయ్య, కేజీబీవీ ప్రత్యేకాధికారి హిమబిందు, ఎంపీఓ శోభ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చూపు బీజేపీ వైపు

- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై నమ్మకం పోయింది
- చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రజలు ప్రస్తుతం బీజేపీ వైపు చూస్తున్నారని, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై నమ్మకం పోయిందని చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్, ఇటీవల వివిధ రాష్ట్రాల ఫలితాలు, అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రతిష్ట తదితర కారణాల వల్ల దేశంలో ప్రధాని నరేంద్రమోదీ మీద నమ్మకం మరింత పెరిగిందన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం దివాళా తీసిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిధులను వాడుకోలేక నిర్వీర్యం చేస్తోందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా మాజీ ఎమ్మెల్యే రత్నం, సిద్దిపేట జిల్లా బీజేపీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సాగు నీరు అందించాలంటూ ర్యాలీ



కొమురవెల్లిలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాలలోని 133 చెరువులను తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా నింపి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రం నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగంగా తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను చేర్యాల ప్రాంత రైతులకు నీరందించేందుకు నిర్మించారని, కానీ రిజర్వాయర్‌లో నీరు లేక వెలవెలబోతుందని అన్నారు. రిజర్వాయర్‌ను నింపిన ప్రతిసారీ చేర్యాల ప్రాంత చెరువులు నింపకుండా ఆలేరు, సిద్దిపేటకు నీటిని తరలించడంపై మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈప్రాంత రైతులను కాపాడాలని కోరారు. ఎప్పటికే వరి సాగు పొట్ట దశలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట్ మావో, ఆలేటి యాదగిరి, బండకింది అరుణ్‌కుమార్, తాడూరి రవీందర్, బద్దిపడిగె కృష్ణారెడ్డి, దాసరి ప్రశాంత్, అత్తిని శారద, మద్దూరు మండల కార్యదర్శి షఫీ, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

40 వీధి కుక్కలకు విషం పెట్టి చంపారు

కేసు నమోదు చేసిన పోలీసులు

గుర్తు తెలియని వ్యక్తులు వీధి కుక్కలకు విషం పెట్టి చంపిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మంగళవారం ఎస్ఐ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 40 వీధి కుక్కలకు విషం పెట్టిచంపారని యానిమల్ వెల్ఫేర్ యాక్టివిటీస్ ఫౌండేషన్ కు చెందిన ఏదులాపురం గౌతమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. **– కొమురవెల్లి(సిద్దిపేట)**

‘స్వచ్ఛ’ సిద్దిపేట దిశగా సాగుదాం

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: ప్రజల భాగస్వామ్యంతో ‘స్వచ్ఛ’ సిద్దిపేట దిశగా సాగుదామని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక విపంచి ఆడిటోరియంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, మెప్మా విభాగం, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో స్వచ్ఛ సర్వేక్షన్ పై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా కేంద్రం నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షన్ పోటీల్లో పట్టణ ప్రజల మద్దతు ద్వారా అనేక జాతీయ స్థాయిలో అవార్డులు పొందామన్నారు. ఈసారి మళ్ళీ ప్రజల అభిప్రాయాలను సేకరించి సిటిజన్ ఫీడ్ బ్యాక్ అంశంపై మెరుగైన ఫలితాలు సాధించాలని, అందుకు ప్రజల సహకారం అవసరమని అన్నారు. పట్టణ ప్రజలు సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో పాల్గొనాలని, అందుకు సిబ్బంది వారిని చైతన్యం చేయాలని సూచించారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్ ప్రక్రియలో భాగంగా క్యూఆర్ కోడ్ ద్వారా లేదా సిబ్బందికి ప్రజాభిప్రాయ అందించి సర్వేలో పాల్గొనాలని సూచించారు.10 రకాల ప్రశ్నలకు ప్రజలు సమాధానం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై అవగాహన కల్పించారు.

‘పాత పెన్షన్’ అమలుకు పోరాటం

సీపీఎస్ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ



టీఎస్‌సీపీఎస్ఈయూ నాయకుల సంఘీభావం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పాత పెన్షన్ విధానం అమలుకు పోరాడుదామని తెలంగాణ స్టేట్ సీపీఎస్ ఎంప్లాయ్ యూనియన్(టీఎస్‌సీపీఎస్ఈయూ) రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థిత ప్రజ్ఞ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో యూపీఎస్ స్కీంను వ్యతిరేకిస్తూ ఆత్మగౌరవ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ సీపీఎస్, యూపీఎస్‌ల రద్దుకు అందరం కలిసికట్టుగా పోరాడుదామన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర శాసనసభ ఎన్నికల మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం హామీని నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీం)ను అమలు చేయాలన్నారు. పాత పెన్షన్ అమలయ్యేదాకా పోరాటమే తమ ఏకైక ఎజెండా అని అన్నారు. అందరం ఏకమై సీపీఎస్, యూపీఎస్ పై వ్యతిరేకంగా పోరాడితే పాత పెన్షన్ విధానం అమల్లోకి వచ్చితీరుతుందన్నారు. సీపీఎస్, యూపీఎస్‌లకు వ్యతిరేకంగా మార్చి 2న ధర్నా చౌక్ వద్ద నిర్వహించే యుద్ధభేరిని విజయవంతం చేయాలన్నారు.కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల్ శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కూరాకుల శ్రీనివాస్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మల్లికార్జున్, జిల్లా అధ్యక్షులు చేగూరి దేవరాజ్, ప్రధాన కార్యదర్శి శశి యాదవ్, జగదీష్, ప్రవీణ్, సీపీఎస్ సంఘ సభ్యులు, ఉద్యోగ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

మర్కూక్(గజ్వేల్): క్రీడాకారులు ప్రతిభను కనబరిచి రాణించాలని నాయకులు కోరారు. మండలంలోని దామరకుంటలో పదిరోజులుగా అండర్ 16 కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఏకలవ్య కబడ్డీ అసోసియేషన్ జట్టుకు క్రీడా దుస్తులు, భోజన ఖర్చులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ పాండుగౌడ్, మాజీ జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, మండల జెడ్పీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు కృష్ణయాదవ్, దామరకుంట మాజీ సర్పంచ్ గాయత్రి, మాజీ ఉప సర్పంచ్ ఆంజనేయులు యాదవ్, కబడ్డీ కోచ్ నరేందర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ‘డ్రోన్’ దన్ను



సాధారణ వ్యవసాయ పంటలకే పరిమితమైన డ్రోన్ విధానం...ఇక ఉద్యాన పంటల్లోనూ అందుబాటులోకి రాబోతున్నది.ములుగులోని కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ వేదికగా కార్యాచరణ సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించి యూనివర్సిటీ అధికారులు పలు కంపెనీలతో ఎంఓయూలకు చర్చలు జరుపుతున్నారు.

కొత్త టెక్నాలజీతో కూలీల కొరతకు చెక్


- దిగుబడులు పెంచుకునేందుకు అవకాశం
- పండ్లు, కూరగాయల తోటలకు తొలిసారిగా కొత్త విధానం
- ములుగు హార్టికల్చర్ యూనివర్సిటీ వేదికగా కార్యాచరణ

గజ్వేల్: సాధారణ వ్యవసాయ పంటల్లో ఇప్పటికే డ్రోన్ల వినియోగం పెరిగింది. కూలీల కొరత ప్రధాన సమస్యగా మారగా డ్రోన్‌ల వినియోగం తరుణోపాయంగా మారుతోంది. ఎరువులు, పురుగు మందుల పిచికారీ సరైన పద్ధతిలో నిమిషాల్లో పూర్తి చేస్తున్నారు. దీనివల్ల అధిక దిగుబడులకు ఆస్కారం కలుగుతున్నది. ఇదే విధానం కొత్తగా ఉద్యాన పంటలైన పండ్లు, కూరగాయల తోటల సాగులో తీసుకొచ్చేందుకు హార్టికల్చర్ యూనివర్సిటీ అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం పలు కంపెనీలతో చర్చలు జరుపుతున్నారు. గత 10వ తేదీన యూనివర్సిటీలో డ్రోన్‌ల ఏర్పాటుపై కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, ఆర్‌టీఓ (రిమోట్ పైలెట్ ట్రెనింగ్ ఆర్గనైజేషన్) అధికారులతో చర్చలు జరిపారు. ఇందుకు సంబంధించి ఒక అవగాహన ఒప్పందం చేసుకోవాలని కూడా ప్రాథమికంగా నిర్ణయించారు. అంతకు ముందు కూడా ఇతర కంపెనీలతోనూ అధికారులు చర్చలు జరిపారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన ఎంఓయూలు పూర్తికానున్నాయి.

ఉద్యాన పంటల్లో ప్రయోగాలు

కంపెనీలతో ఒప్పందాలు పూర్తయితే ఉద్యాన తోటలను ఎంచుకొని పంటల వారీగా ప్రయోగాలు చేయనున్నారు. పండ్ల తోటలు, కూరగాయల పంటల్లో అయిదారు రకాలు ఒకేసారి ఎంపిక చేసి ఆయా తోటల్లో డ్రోన్ ఆధారిత విధానం అమలు కోసం కచ్చితమైన పద్ధతులను నిర్ధారించడానికి స్టాండర్డ్ ఆపరేటివ్ సిస్టమ్(ఎస్‌ఓపీ)ని అభివృద్ధి చేయనున్నారు. సాధారణ వ్యవసాయ పంటలతో పోలిస్తే ఉద్యాన పంటలు పూర్తిగా భిన్నం. కనుక తోటల్లో పురుగుమందులు, ఎరువులు కొమ్మకొమ్మకు పడే విధానం అభివృద్ధి చేయనున్నారు. ముఖ్యమైన విషయమేమిటంటే డ్రోన్‌ల వినియోగంపై రైతులకు శిక్షణ కూడా ఇవ్వనున్నారు. ఈ ప్రయోగాలను యూనివర్సిటీలోని డ్రోన్ సెంటర్ నుంచి నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. రెండు, మూడు నెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు.

త్వరలోనే డ్రోన్ విధానం



ఉద్యాన పంటలకు డ్రోన్ విధానం ప్రస్తుతం చర్చల దశలో ఉంది. పలు కంపెనీలతో చర్చలు విజయవంతంగా సాగుతున్నాయి. ఇది పూర్తి కాగానే ప్రయోగాత్మకంగా చేపడతాం. వచ్చే ఫలితాలను రైతులకు వివరించి అందుబాటులోకి తెస్తాం.

– డాక్టర్ దండ రాజిరెడ్డి, వైస్ ఛాన్స్‌లర్, హార్టికల్చర్ యూనివర్సిటీ



ములుగులోని హార్టికల్చర్ యూనివర్సిటీ ముఖ ద్వారం

క్లుప్తంగా

తూప్రాన్‌లో కార్డెన్ సెర్చ్

సరైన పత్రాలు లేని
92 బైకులు, 5 ఆటోలు సీజ్



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకట్‌రెడ్డి

తూప్రాన్: అనుమానిత వ్యక్తులు కనిపించినా, అసాంఘిక కార్యక్రమాలు జరిగినా తమ దృష్టికి తేవాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తూప్రాన్ మున్సిపాల్టీ పరిధిలోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద డీఎస్పీ ఆధ్వర్యంలో 7 బృందాలతో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో సరైన ధ్రువపత్రాలు లేని 92 బైకులు, 5 ఆటోలు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ వాహనాలకు సంబంధించిన పత్రాలను చూపి తమ వాహనాలను తీసుకెళ్లాలని సూచించారు. లేదంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీరి వెంట తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు శివారులో రేషన్ బియ్యం పట్టుకున్నట్లు కొల్లూరు ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా మోకిల నుంచి రింగ్‌రోడ్డు మీదుగా కర్నూలు తరలిస్తున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో రింగ్ రోడ్డుపై రేషన్ బియ్యం తరలిస్తున్న లారీను పట్టుకొని 34 టన్నులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మంగళవారం సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

నో హెల్మెట్.. నో ఎంట్రీ

కలెక్టరేట్‌కి వచ్చేవారికి కొత్త నిబంధనలు



వాహనదారులను ప్రధాన గేటు వద్ద నిలిపివేస్తున్న సిబ్బంది

మెదక్ కలెక్టరేట్: కలెక్టరేట్‌లోకి వాహనదారులు రావాలంటే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. హెల్మెట్ ధరించని వాహనదారులను కార్యాలయంలోకి రానివ్వొద్దంటూ గట్టి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కార్యాలయ సిబ్బంది మంగళవారం ప్రధాన గేట్ వద్ద తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా వచ్చిన వాహనదారులను కలెక్టరేట్‌లోకి అనుమతించలేదు. లేదంటే గేటు బయటే వాహనం నిలిపి లోపలికి వెళ్లాలని సూచించారు. హెల్మెట్‌తో పాటు వాహన పత్రాలు, లైసెన్స్ కలిగి ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు సిబ్బంది తెలిపారు.

పెరిగిన బియ్యం కోటా

- 888 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు
- పాత కార్డుల్లో చేర్పులతో పెరిగిన లబ్ధిదారులు
- ప్రతీనెల 12 మెట్రిక్ టన్నుల బియ్యం అదనం
- నేటికీ కొనసాగుతున్న దరఖాస్తుల పరిశీలన
- లబ్ధిదారుల్లో సంతోషం



రేషన్ దుకాణంలో బియ్యం పంపిణీ

సిద్దిపేటరూరల్: కొత్త రేషన్‌కార్డుల మంజూరు జిల్లాలో పంపిణీ చేసే బియ్యం కోటా ఈనెల నుంచి పెరిగింది. పదేళ్ల కాలంలో నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ లేకపోవడంతో ప్రస్తుత ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేసింది. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారుల కల నెరవేరింది. జిల్లాలో మొదటి విడతగా 888 కుటుంబాల వారు అర్హత సాధించినట్లు వివరాలను వెల్లడించారు. వారందరికీ ఫిబ్రవరి నుంచే రేషన్ బియ్యం అందజేస్తామని అధికారులు ప్రకటించారు. దీంతో రేషన్ పంపిణీ చేసే బియ్యం అదనంగా 12 మెట్రిక్ టన్నులకు పెరిగింది.

జిల్లాలో ఇప్పటి వరకు గ్రామసభలు, ప్రజాపాలన కేంద్రాల్లో స్వీకరిస్తున్న దరఖాస్తుల్లో నూతన రేషన్‌కార్డులు, చేర్పులు, తొలగింపు వంటి వాటికి సంబంధించి 74 వేల 272 దరఖాస్తులు వచ్చాయి. ఈ మేరకు సంబంధిత అధికార యంత్రాంగం సర్వే పూర్తి చేయడంతో పాటుగా అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు ఇచ్చింది. మరి కొంతమంది మంజూరు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో రేషన్ వివరాలు :

రేషన్ దుకాణాలు	684
రేషన్ కార్డులు	2,92,131
అంత్యోదయ కార్డులు	18341
మొత్తం లబ్ధిదారులు	8,95,467
అన్నపూర్ణ కార్డులు	82

నెలవారీగా పంపిణీ చేయాల్సిన బియ్యం **5,720** మెట్రిక్ టన్నులు

కొత్త కార్డు వచ్చింది



ప్రభుత్వ చేపట్టిన ఇంటింటి సర్వే సమయంలో నూతన రేషన్‌కార్డు కోసం దరఖాస్తు అందించాను. గత నెలలో నా పేరు మీద నూతన రేషన్ కార్డు వచ్చింది. చాలా రోజులుగా రేషన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్నాం. ఇప్పటికై నా రావడం చాలా సంతోషంగా ఉంది. దీంతో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను పొందేందుకు అవకాశం ఉంది.

– పుల్లగూర్ల తేజ, రాఘవాపూర్

అర్హులందరికీ అందిస్తాం



జిల్లాలో ఇటీవల 888 నూతన రేషన్ కార్డులు మంజూరు చేయడంతోపాటు 1,900 మంది పేర్లను రేషన్ కార్డుల్లో కొత్తగా చేర్చాం. వీరికి బియ్యం అందించడం జరుగుతుంది. కొత్త కార్డులు రావడం, పాత కార్డుల్లో మార్పులు, చేర్పులు జరగడంతో జిల్లాలో ఈ నెల రేషన్ బియ్యం కోటా 12 మెట్రిక్ టన్నులకు పెరిగింది. తమ వద్ద ఉన్న దరఖాస్తులను పరిశీలించడం జరుగుతుంది.

– తనూజ, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి

888 నూతన కార్డులు

జిల్లాలో కొత్తగా 888 కుటుంబాలకు ప్రభుత్వం రేషన్ కార్డులను మంజూరు చేసింది. ఈ మేరకు చాలా మందికి లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే కార్డు ఉండి అందులో పిల్లల పేర్లు లేకుండా చాలా మంది ఉన్నారు. ఇందులో కొత్తగా 1,900 మందిని వారి పాత కార్డుల్లో చేర్చారు. వీరందరికీ ఈనెల నుంచి బియ్యాన్ని అందించాల్సి ఉండగా అదనంగా 12 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం పడుతుంది. జిల్లా వ్యాప్తంగా పెండింగ్ ఉన్న దరఖాస్తుల్లోనూ అర్హులను గుర్తిస్తే ఈ కోటా మరింతగా పెరిగే అవకాశం ఉంటుంది.

లబ్ధిదారుల్లో సంతోషం

ఎన్నో ఏళ్లుగా నిలిచిన రేషన్ కార్డుల ప్రక్రియ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ముందుకు కదలడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలన్నింటికీ రేషన్ కార్డే ప్రామాణికం కావడంతో జిల్లాలో కార్డులేని వారు దశాబ్ద కాలంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు మంజూరు కాక, ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు అందక, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రుణాలు పొందలేక ఎన్నో అవస్థలు పడ్డారు. ఈ క్రమంలో జిల్లాకు కొత్తగా 888 మందికి కొత్త కార్డులు రావడంతో తమకు కూడా ప్రభుత్వ పథకాలు వస్తాయనే నమ్మకం అర్హులైన దరఖాస్తుదారుల్లో ఏర్పడింది.

మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్య

తంప్లూర్‌లో వ్యక్తి

టేక్మాల్(మెదక్): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన టేక్మాల్ మండలంలోని తంప్లూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ దయానంద్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన చాకలి అశోక్ (38), వెంకట్రావు పేటకు చెందిన వెంకటలక్ష్మికి 20 ఏళ్ల కింద వివాహం జరిగింది. వీరిద్దరూ హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. వీరిద్దరి మధ్య కుటుంబ విషయంలో కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. 16న దంపతులిద్దరూ తంప్లూర్ గ్రామానికి వచ్చారు. అదే రోజు మధ్యాహ్నం ఇంటి వద్ద గొడవ జరగడంతో వెంకటలక్ష్మి హైదరాబాద్ వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన అశోక్ సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి చాకలి పోచయ్య మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నార్సింగ్‌లో యువకుడు

పాపన్నపేట(మెదక్): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని నార్సింగిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు.. మధ్యప్రదేశ్ కు చెందిన సంజీవ్ కుమార్ (25) ఉపాధి నిమిత్తం రాష్ట్రానికి వచ్చి కామారెడ్డికి చెందిన శ్రీలత అనే అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. కొంత కాలంగా పాపన్నపేట మండలం నార్సింగి గ్రామంలో వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగొద్దని చెప్పినా వినకపోవడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న భార్య శ్రీలత ఘటనా స్థలికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



లక్ష్మయ్య (ఫైల్)

టేక్మాల్(మెదక్): చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బొడ్మట్‌పల్లిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ దయానంద్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన చీలపల్లి లక్ష్మయ్య(59) రజక వృత్తితోపాటు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తరచుగా చేపలు పట్టేందుకు వాగుల్లోకి, కుంటల్లోకి వెళ్లేవాడు. 14న ఉదయం ఇంటి నుంచి వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. ఆచూకీ కోసం బంధువులు, వ్యవసాయ పొలాల వద్ద వెతుకుతుండగా 17న రాత్రి గుండువాగు గడ్డపై లక్ష్మయ్య బట్టలు, సెల్‌ఫోన్, చెప్పులు కనిపించాయి. వాగులోకి పరిశీలించి చూడగా లక్ష్మయ్య మృతదేహం కనిపించింది. చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య చీలపల్లి పోచమ్మ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు

పుల్‌కల్(అందోల్): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని పుల్‌కల్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీస్‌ల కథనం మేరకు.. పుల్‌కల్ గ్రామానికి చెందిన బోయిని నవీన్ (25) సోమవారం రాత్రి కడుపునొప్పి భరించలేక ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సంగారెడ్డి ఆస్పత్రికి తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పుల్‌కల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహేతర సంబంధంతో
హత్యాయత్నం

- మహిళ భర్తపై దాడికి పాల్పడ్డ యువకుడు
- అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు

సిద్దిపేటకమాన్: మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న యువకుడు ఆమె భర్తపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం మేరకు.. ఐల శ్రీధర్, భార్య ఇద్దరు పిల్లలతో కలిసి గుండ్ల చెరువులో నివాసం ఉంటున్నాడు. శ్రీధర్ పట్టణంలోని ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన మెరుగు శ్రావణ్ (21) సదరు మహిళతో కొద్ది రోజులుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. దీనికి గాను అడ్డు తొలగించుకోవాలని శ్రవణ్‌తో కలిసి భర్త శ్రీధర్‌ను చంపడానికి పథకం వేసింది భార్య. గత నెల 11న రాత్రి పని ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న శ్రీధర్‌ను శ్రావణ్ లిఫ్ట్ అడిగాడు. ఇద్దరూ బైక్‌పై వెళ్తున్న క్రమంలో నర్సాపూర్ చౌరస్తా సమీపంలో యువకుడి ఇద్దరు స్నేహితులు వీరి వెనుకాలే వచ్చారు. ముగ్గురూ కలిసి శ్రీధర్‌ను కిడ్నాప్ చేసి కాళ్లు, చేతులు కట్టేసి దాడి చేశారు. మళ్లీ రెండోసారి గత నెల 20న శ్రీధర్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు శ్రీధర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా 12న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక విచారణ అనంతరం ప్రధాన నిందితుడు మెరుగు శ్రావణ్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన బొలేరో వాహనం

కామారెడ్డి జిల్లాలో సిర్గాపూర్ మండలానికి చెందిన మహిళ మృతి



శకుంతల మృతదేహం

కల్హేర్(నారాయణఖేడ్): కామారెడ్డి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సిర్గాపూర్ మండలం అంతర్‌గామ్‌కు చెందిన మహిళ మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. అంతర్‌గామ్‌కు చెందిన సంగయ్య, శకుంతల(55) దంపతులు బైక్‌పై మంగళవారం కామారెడ్డి జిల్లా పిట్లం మండలం పెద్దకొడప్‌గల్ గ్రామంలోని బంధువుల ఇంటికి బయల్దేరారు. చిన్నకొడప్‌గల్ వద్ద సంగారెడ్డి–నాందేడ్ 161 నేషనల్ హైవేపై వెనుక నుంచి బొలేరో వాహనం వీరి బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా అంబులెన్స్‌లో స్థానికులు పిట్లం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో శకుంతల మృతి చెందింది. సంగయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పిట్లం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త రకం శనగతో అధిక దిగుబడులు

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త పల్లవి



శనగ పంటపై పరిశోధన చేస్తున్న శాస్త్రవేత్తలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రైతులు ఎన్‌బీ ఈజీ 47 కొత్త రకం శనగను సాగు చేసుకోవాలని, దీంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త పల్లవి, కో ఆర్డినేటర్ విజయ్ తెలిపారు. మండల కేంద్రమైన జగదేవ్‌పూర్, అలిరాజ్‌పేట గ్రామంలో రైతుల పొలాల్లో వ్యవసాయ శాఖ సహకారంతో క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ రకం శనగను సాగు చేస్తే నిటారుగా పెరగడమే కాకుండా కాయ పైకి వస్తుందని, మెషిన్ హార్ వెస్టింగ్ చేసుకోవడానికి అనువుగా ఉంటుందన్నారు. ఎండు తెగుళ్ని సమర్థవంతంగా తట్టుకొని 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. అనంతరం ఎనుగుల శ్రీనివాస్‌రెడ్డి రైతు పొలంలో వేసిన ధనియాల సాగును పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు, ఏఈఓ కవిత, రైతులు పాల్గొన్నారు.

పోషకాల లోపం.. ఎదుగుదలపై ప్రభావం

వ్యవసాయ అధికారులు



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ నరేశ్

దుబ్బాకటౌన్: సాగు భూమిలో పోషకాల లోపంతోనే వరి నాటు వేసిన తర్వాత ఎదుగుదలపై ప్రభావం చూపిస్తుందని రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేశ్ తెలిపారు. మంగళవారం రాయపోల్ మండల పరిధిలోని రాంసాగార్ గ్రామంలో వరి పొలాలను, రైతుల పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సాగు చేసే వరి పంటలో చౌడు భూమిలో వరి ఎర్రబారి వేసిన కర్ర వేసినట్లు ఉండి పొలం అంతా బుడబుడగా ఉండి వరి వేర్లు నల్లగా మారి భూమి లోపలి పోషకాలు తీసుకోకపోవడంతో జింక్, ఇతర పోషకాల లోపాలు కనిపిస్తున్నాయన్నారు. నివారణకు 19.19.19 ఒక కేజీ ఎకరానికి + జింక్ సల్ఫేట్ 400–500 గ్రాములు ఎకరానికి రెండు సార్లు పిచికారీ చేసి, పొలం బాగా నెర్రలు వచ్చే లాగా ఆరబెట్టాలన్నారు. ప్రస్తుతం యాసంగి కాలంలో జింక్ లోపాలు ఎక్కువ కనిపించే అవకాశం ఉందని, జింక్ నివారణ కోసం జింక్ సల్ఫేట్ 2.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రవీణ్, స్వర్ణలత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరబెడుతూ నీటి తడులు అందించాలి

వరి పంటను పరిశీలించిన వ్యవసాయాధికారులు

సాక్షి ఎఫెక్ట్..



దుబ్బాకలో పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

దుబ్బాక: ఎవరికీ రాకూడని కష్టం.. ఎర్రబడి చచ్చిపోతున్న వరి చేలు పేరిట సాక్షిలో ప్రచురితమైన కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. మంగళవారం వ్యవసాయాధికారులు జిల్లాలోని పలు గ్రామాల్లో పర్యటించి వరి పంటలను పరిశీలించారు. దుబ్బాక మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్, ఏఈఓ మనోజ్ఞ పట్టణంలోని కేసుగారి స్వామి, గుండెల్లి శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు రైతుల పంటలను పరిశీలించారు. నాట్లేసి 45 రోజులు గడుస్తున్నా వరిపంటలు ఎదుగుదల లేకుండా కుళ్లిపోయి, ఎర్రబడి చచ్చిపోతుండడాన్ని గమనించారు. మొగి పురుగు, వాతావరణ పరిస్థితులు, భూములు తడి ఆరకుండా ఉండడంతోపాటు జింక్ తదితర సమస్యలతో పంటలకు నష్టం జరుగుతుందని గమనించారు. మొగి పురుగు ఎక్కువగా ఆశించిన పంటలకు కార్టాప్ 4 జీ గుళికలు లేదా క్లోరంట్రానిలిప్రోల్ లేదా బరోజ్ వంటి మందులు వేసుకోవాలన్నారు. వరి పంటలను ఆరబెడుతూ నీటి తడులు అందించాలి. పలు సస్యరక్షణ చర్యలను రైతులకు సూచించారు.

పన్ను వసూళ్లలో వేగం పెంచాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి జోన్: గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లలో వేగం పెంచి వందశాతం పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి పంచాయతీ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి మండల ప్రత్యేక అధికారులు, మండల పరిషత్ అధికారులు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ పన్ను చెల్లింపు అవసరాన్ని తెలియజేయాలన్నారు. గ్రామాల్లో ఇంటి యజమానులు, ఇంటి పన్ను చెల్లించేందుకు ముందుకు రావాలని కోరారు. రేషన్ కార్డుల వెరిఫికేషన్ పూర్తిగా పారదర్శకంగా జరగాలని అర్హులైన వారికి మాత్రమే రేషన్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పూర్తి సమాచారం అధికార యంత్రాగణానికి అందుబాటులో ఉండాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు, పాఠశాలలను, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలను క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డీపీఓ సాయిబాబా, ట్రైనీ కలెక్టర్ మనోజ్, సంబంధిత జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు



శివ్వంపేటలో ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

నర్సాపూర్: పోలింగ్ కేంద్రం వద్ద నిబంధనల మేరకు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఎస్‌ఐ లింగంకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఎస్పీ మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వం జూనియర్ కాలేజీలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను, ఓటరు జాబితాను పరిశీలించారు. ఎస్‌ఐ, మండల ఆర్‌ఐ ఫైజల్ పోలింగ్ స్టేషన్ల వివరాలను ఎస్పీకి వివరించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లో పలు రికార్డులు పరిశీలించి కేసులను త్వరగా ఛేదించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలని ఎస్‌ఐకి సూచించారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేట ఉన్నత పాఠశాలలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట సీఐ రంగక్రిష్ణ, ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి ఉన్నారు.

పందిరి సాగు.. ఫలితాలు బాగు

- ఉద్యాన పంటలతో సిరులు
- ఆసక్తి చూపుతున్న రైతులు



పందిరి సాగు విధానంతో బీరకాయ సాగు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆరుగాలం కష్టపడి ప్రకృతి వైపరీత్యాలు తట్టుకొని వరి సాగు చేస్తే సరైన దిగుబడి రాక, గిట్టుబాటు ధర అందడం లేదని ఆందోళన చెందుతున్న రైతులు తమ ఆలోచను మార్చుకుంటున్నారు. సంప్రదాయ పంటలకు బదులుగా ఉద్యాన పంటల వైపు మళ్లుతున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ తమకున్న కొద్ది పాటి సాగు భూమిలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రత్యామ్నాయ ఉత్పత్తులు, ఉద్యాన పంటల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటే సాగును లాభాల బాటలో నడిపించొచ్చని నిరూపిస్తున్నారు. చిన్నకోడూరు మండలంలో సుమారు 90 ఎకరాల్లో పందిరి సాగు ద్వారా కూరగాయలు పండిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

పందిరి సాగుతో మేలు

రైతులు వారి భూముల్లో పందిరి వేసి, ఉద్యాన పంటను సాగు చేస్తే మంచి లాభాలను పొందవచ్చు. ఎకరా భూమిలో పందిరి సాగు అమలు చేసే రైతులు ఉద్యానశాఖ ద్వారా రూ. లక్ష సాయం అందిస్తుండగా, ఇందులో రూ. 50 వేలు సబ్సిడీ వస్తుంది. మిగితా సగాన్ని రైతులు భరించాల్సి వస్తుంది. అధికారులే పందిరి సిద్ధం చేసి ఇస్తారు. సుమారు నాలుగేళ్ల వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీగజాతి కూరగాయలు పండించుకోవచ్చు. కాకర, బీర, దొండ, సొరకాయ పండిస్తూ ఆదాయం పొందవచ్చు. పందిరి కింది బాగంలో ఖాళీగా ఉన్న స్థలంలో టమాట, వంకాయ, బెండ వంటి అంతర పంటలు సాగు చేయవచ్చు.

దిగుబడి బాగుంది

పందిరి సాగు విధానంతో దిగుబడులు బాగున్నాయి. ఈ విధానం ద్వారా కలుపు తక్కువగా ఉండి కూలీల అవసరం ఉండదు. కూరగాయలు కుళ్లిపోకుండా ఉంటాయి. చీడ పీడలు ఎక్కువగా ఆశించవు. పంటలు సాఫీగా వస్తాయి. మార్కెట్‌ల మంచి ధర పలుకుతుంది.

–నాగర్తి తిరుపతిరెడ్డి, రైతు మాచాపూర్